




ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 64 వినతులు

ప్రజాశక్తి-నెల్లూరు
స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని తిక్కన హాల్లో శుక్రవారం నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని 64 మంది ఉద్యోగులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగస్తునితో కలెక్టర్, జాయింట్ కలెక్టర్,డి.ఆర్.ఒ వారితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత దరఖాస్తులను ఆయా శాఖ అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగస్తులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

'కిసాన్' సెజ్‌కు గ్రీన్ సిగ్నల్..!

..జిఒ నెం.156 విడుదల
..రూ.1000 కోట్లతో మూడు భారీ ప్రాజెక్టులు
..30న ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
రాష్ట్ర కేబినెట్ కిసాన్ సెజ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది..ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.. ఇందుకు సంబంధించి పరిశ్రమశాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ జిఒ నెంబర్ 156 విడుదల చేశారు.. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సిఐఐ సమ్మిట్ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఇఫ్కో చైర్మన్, ఎండిలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.. ప్రభుత్వం నుంచి తొలగించి, సహకారం అందిస్తే సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల కోట్లు పెట్టుబడులు, సుమారు 25 వేల మంది యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని ఇఫ్కో యాజమాన్యం సిఎంకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అందుకు అంగీకరించిన ప్రభుత్వం నుంచి అన్నిసదుపాయాలు కల్పిస్తామని, వేగంగా కిసాన్ సెజ్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.. తొలి విడతగా మూడు భారీ ప్రాజెక్టులు రూ.1000 కోట్లతో ప్రారంభంకానున్నాయి. ఈనెల 30 ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. వెయ్యి మందికి ఉపాధి, ఉద్యోగం లభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇఫ్కో ఎరువుల పరిశ్రమ వేగంగా ముందుకు సాగడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి వరకు ఉన్న అడ్డంకులు తొలగించాలని నిర్ణయం తీసుకుంది. ఇఫ్కో ఎరువుల కోసం కొడవలూరు మండలం, రేగడ చెలిక వద్ద 40 సంవత్సరాల క్రితం సుమారు 2776 రైతులు నుంచి తీసుకున్నారు. అప్పుడు ఎరువుల పరిశ్రమ రాలేదు. 2007లో ఈ భూములను కిసాన్‌సెజ్‌కు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేటాయించారు. . ప్రస్తుతం 150 ఎకరాల్లో గమేశా, మరో 150 ఎకరాలు కోకో కోలా కంపెనీలు తీసుకున్నాయి. గమేశా తాత్కాలికంగా నిలిపివేసింది. కోకోకోలా ప్రొసెస్‌లో ఉంది. ఇప్పటికే కనిగిరి నుంచి సెజ్ వరకు 14 కిలో మీటర్లు పైప్‌లైన్ వేశారు. ఇక్కడ దగ్గర్లో దగదర్తి విమానాశ్రయం, రైల్వే స్టేషన్, జాతీయ రహదారి అందుబాటులో ఉండడంతో కిసాన్ సెజ్‌కు కలిసొచ్చే అంశాలుగా చెప్పొచ్చు. అనేక పరిశ్రమలు రావడానికి సిద్ధంగా ఇక్కడ ఉన్నా కొన్ని సమస్యలతో వెనక్కి వెళుతున్నాయని తెలుస్తోంది..

ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..!
1997లో ఇఫ్కో కిసాన్ సెజ్ కోసం భూములు తీసుకున్నా, ఇప్పటి వరకు పరిశ్రమలు పెద్దగా రాలేదు. ఈ ప్రాంత ప్రజలు, యువత ఎదురుచూస్తున్నారు. ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన సమ్మిట్‌లో ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘానీ, ఎండి కెజె పటేల్, జాయింట్ ఎండి రాకేష్ కపూర్, కిసాన్‌సెజ్ సిఇఒ సుధాకర్‌తో సిఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.రూ.300 కోట్లు ఖర్చు చేశామని, లీగల్ సమస్యలతోపాటు, ప్రభుత్వం నుంచి కొన్ని ఆంక్షల కారణంగా పరిశ్రమలు ఏర్పాటు ఆలస్యమవుతుందని అప్పట్లో సిఎం దృష్టికి తీసుకెళ్లారు.2017-2024 వరకు పబ్లిక్ ఇంట్రస్ట్ లిటికేషన్ కేసులుండగా, ఇందులో జడ్జిమెంట్ వచ్చింది, 16 నెలల క్రితం భూములను 22 ఎ కింద చేర్చారు. మాస్టర్ ప్లాన్ మార్పు చేయాలని రూ.23 కోట్లు చెల్లించాలని డిమాండ్ ఉంది. లేఔట్, మార్టిగేజ్, వంటి సమస్యలతో భూములు కేటాయింపులు చేయలేకపోతున్నారు.ఈ కారణంగా అనేక పెద్ద పరిశ్రమలు వెనక్కి వెళ్లినట్లు తెలిసింది. . ఇండస్ కాఫీ కంపెనీ సింగపూర్ వెళ్లింది. సిఆర్‌డబ్ల్యుసి, మనీ నవరత్న – ఇఫ్కో జాయింట్ వెంచర్, ఇఫ్కో, స్పెయిన్ కంపెనీ జాయింట్ వెంచర్‌ను జలంధర్‌కు ఇఫ్కోనానో ఎరువుల పరిశ్రమ బెంగుళూరుకు సౌత్ కొరియా బ్యాటరి వాహనాల తయారీ కేంద్రం యుపికి ఏర్పాటు చేసుకున్నారు.ప్రభుత్వ సహకారం పెద్దగా లేకపోవడంతో వచ్చే పరిశ్రమలు వెళ్లిపోతున్నాయనే విషయాన్ని ఇఫ్కో సిఎం దృష్టికి తీసుకెళ్లింది. అన్ని అడ్డంకులు తొలగించి, కిసాన్ సెజ్‌కు ఏం కావాలో చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



జిఒనెం.156 విడుదల
ఇఫ్కో కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుతో నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక పురోగతికి నూతన శకం ప్రారంభమైంది. ప్రభుత్వం తాజాగా జిఒ నెంబర్ 156 విడుదల చేసింది. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ ఈమేరకు జిఒ ఇచ్చారు. దీని ప్రకారం ఇఫ్కో సెజ్‌లో 22 ఎ కింద ఉన్న భూములను దాని నుంచి తొలగించనున్నారు. కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. మాస్టర్ ప్లాన్ రివిజన్ అప్రూవల్ అయింది. 120 ఎకరాలు ఎపిఐఐసి ఇఫ్కో ఇవ్వనుంది. తొలి విడతగా రూ.1000 కోట్లతో మూడు పెద్ద పరిశ్రమలు రానున్నాయి. బయో ఎతనాల్ కింద 1 రాంజీ, 2 గాయత్రి ప్రాజెక్టులు, 3 మెరైన్ బయో పాలిమర్స్ కింద ఆక్వాలో వచ్చిన వ్యర్థాలను హెల్త్ సమ్ వేస్ట్ కింద శుద్ధి చేయనున్నారు. ఈనెల 30న ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఈ మూడు ప్రాజెక్టులు వస్తే వెయ్యి మంది ఉద్యోగం, ఉపాధి దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. 400 ఎకరాల్లో మరో నాలుగు యూనిట్లు రూ.15 వేల కోట్లతో పెట్టనున్నట్లు తెలుస్తోంది. కిసాన్ సెజ్ పూర్తిగా అందుబాటులోకి వస్తే 75 వేల మందికి ఉపాధి, ఉద్యోగం లభిస్తుంది. జిల్లా విభజన జరిగిన తరువాత కిసాన్‌సెజ్‌పైనే జిల్లా ప్రజలు, యువత ఆశలు పెట్టుకుంటున్నారు. ఏం జరుగుతుందో చూడాలి..

ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

నల్లజెండాలతో గాంధీబొమ్మ సెంటర్‌లో మౌన దీక్ష



మూతికి నల్ల గుడ్డలు కట్టుకొని మౌన దీక్ష చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు: వామపక్ష పార్టీల సిఫార్సు మేరకు యుపిఎ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు అమల్లోకి తీసుకొచ్చిన మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం యథాతథంగా కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్‌లో నల్లజెండాలు చేతపట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గాంధీబొమ్మ ఎదుట జిల్లా కమిటీ సభ్యులు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తమ మూతులకు నల్లరిబ్బన్‌తో మౌన దీక్ష (సత్యాగ్రహం) చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మీడియాతో మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో ఉన్న తనకున్న అధికార బలంతో మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా పనిచేస్తుం దన్నారు. అందులో భాగంగానే ఈ పథకం పేరును మార్పు చేస్తూ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఉపాధి హామీ పథకంలో ఉన్నత విద్యనభ్యసించిన అనేక మంది గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరుద్యోగులు ఈ పథకంలో పనిచేస్తున్నారన్నారు. వాస్తవానికి ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాలల్లో నిరుద్యోగులకు ఉపాధి లభించిందన్నారు. అంతే కాకుండా ఉన్నత విద్యనభ్యసించిన అనేక మంది నిరుద్యోగులు ఈ పథకంలో ఉపాధి పొందుతున్నా రన్నారు. ఈ పథకంలో గ్రామీణ ప్రాంతంలోని రహదారులు, పంట కాలువలు, వ్యవసాయానికి సంబంధించిన బావులు తవ్వడం వంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ పథకంలో వంద రోజులు పనులు గ్రామీణ ప్రాంత ప్రజలకు చేసుకుంటున్నారన్నారు. ఈ పథకంలో చేసిన పనులకు బిల్లులు ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిందన్నారు.ఈ పథకం అమలు చేసేందుకు అవసరమైన నిధులను కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం కేటాయిస్తుంటే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బిల్లు సవరణ చేసి కేంద్ర ప్రభుత్వం 60శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించే విధంగా నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నా, అధికార బలంతో ఈ బిల్లును ఆమోదింప చేసుకున్నార న్నారు. ఇది ఎంతో ప్రమాదకరమైందన్నారు. నేడు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘం,కౌలు రైతు సంఘం,పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 22వ తేదీన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు చేయడం వల్లనే నిరుపేదల పట్టెడు అన్నం తినగలుగుతున్నారని, అటువంటి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. బిజెపి నాయకులకు గాంధీమహాత్ముడంటే అసలు గిట్టదన్నారు.ఆ క్రమంలో మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సవరణ చేస్తున్నామని ప్రకటించి ఈ ఉపాధి హామీ పథకం పేరును మార్పు చేస్తు నిర్ణయం తీసుకొని 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ 'అన్న పేరుతో అమలు చేసే ప్రయత్నం చేస్తుం దన్నారు. దేశ వ్యాప్తంగా వాపక్షపార్టీలు, వ్యవ సాయ కార్మిక సంఘాలు, రైతు, కౌలు రైతు సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు.కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా అధ్యక్షుడు పులి గండ్ల శ్రీ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, మాల్యాద్రి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు చాన్‌బాషా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్ ,కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పొట్టేపాలెం చంద్రమౌళి, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కె.అజయ్‌కుమార్, జి.నాగేశ్వరావు, కె. పెంచలనరసయ్య, కత్తి శ్రీనివాసులు ,మూలం ప్రసాద్, మహిళా సంఘం నాయకులు షేక్ మస్తాన్‌బీ, కత్తి పద్మ, డివైఎఫ్ఐ నాయకులు బి.పి నరసింహా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై దౌర్జన్యం హేయం

ప్రజాశక్తి-నెల్లూరుఅర్బన్: మున్సిపల్ కార్మికులు వాళ్లకు రావాల్సిన హక్కుల కోసం 45 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తుంటే కనీసం అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని మోయల్ల గౌరీ అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్సిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు ఆడవారని కూడా చూడ కుండా మహిళా పోలీసుల లేకుండా ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి వాహనాల్లో ఎక్కించడం దారుణం అన్నారు. ఈ రాష్ట్రంలో మహిళల హక్కులే లేనున్నట్లు పోలీసుల వ్యవహరించడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని దుయ్యపెట్టారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఎక్కడ చూసినా మహిళలు, చిన్నారులపై దౌర్జన్యాలు,లైంగిక వేధింపులు జరుగుతున్నా పోలీసులు ఏమి చేతగానితనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని, మున్సిపల్ కార్మికుల చేస్తున్న సేవలు గుర్తించకపోయిన పరవాలేదు గానీ వారిని అగౌరవపరచడం దారుణం అన్నారు. ఈ విషయాన్ని మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా వైసీపీ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రానున్న డాక్టరు జి.సతీష్ రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు (కేబినెట్ హోదా), భారత ప్రభుత్వ జాతీయ భద్రతా సలహా మండలి (ఎన్ఎస్ఏబి) సభ్యులు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, భారత రక్షణ శాఖలో మాజీ కార్యదర్శి, డి.ఆర్.డి.ఒ మాజీ చైర్మన్, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహా దారుగా సేవలంది ంచిన డాక్టరు. జి. సతీష్ రెడ్డి నేడు జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టరు సతీష్‌రెడ్డి నేటి నుంచి 22వ తేదీ వరకు జిల్లాలో పర్యటిస్తారన్నారు. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు బెంగళూరు నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి, సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి చేరుకుని అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి, రాత్రి 8.00 గంటలకు నెల్లూరుకు చేరుకొని టెక్కేమిట్ట హౌస్‌లో బస చేస్తారన్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు నెల్లూరు నుండి దుత్తలూరుకు రోడ్డు మార్గంలో బయలుదేరి, ఉదయం 10.00 గంటలకు దుత్తలూరులో నిర్వహించే స్కాలర్‌షిప్ అవార్డ్స్ కార్యక్రమంలో హాజరవుతారన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు మహిమలూరుకు బయలుదేరి, మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. సాయంత్రం 4.00 గంటలకు తిరిగి నెల్లూరుకు చేరుకొని రాత్రి టెక్కేమిట్ట హౌస్‌లో బస చేస్తారన్నారు .డిసెంబర్ 22, సోమవారం ఉదయం 7.30 గంటలకు నెల్లూరు నుండి విజయవాడకు రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్తారని తెలిపారు.



కలెక్టరేట్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న కలెక్టర్

కలెక్టరేట్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -నెల్లూరు
:క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని, మానవ జీవితంలో ప్రతిఒక్కరూ ఐక్యత, ప్రేమ, దయతో నిజాయితీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని కలెక్టర్ హిమా న్షు శుక్ల అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణ ంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముం దస్తు క్రిస్మస్ వేడు కలు– హైటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, కరుణ, త్యాగం, మానవ సేవకు ప్రతీక అని అన్నారు. జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి స్థలాలు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-కందుకూరు
: పట్టణం కోవూరు రోడ్డులోని నాల్గవ తరగతి సంఘం లేఅవుట్లో స్థలాలు,ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందని కందుకూరు సబ్ రిజిస్ట్రార్ ఎం.రామకోటయ్య తెలిపారు.ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో లేఅవుట్‌కు ఉన్న సమస్యలు తొలిగిపోయాయి. నాగేశ్వరరావు ఎంఎల్ఎగా గెలిచిన తరువాత ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు.జీఓ కాపీ ఎంఎల్ఎ తెచ్చారు. శనివారం నుంచి నాల్గవతరగతి సంఘం లేఅవుట్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు.

పశు ఆరోగ్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-లింగసముద్రం: రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ,రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి ఆర్థిక సహకారంతో మండలంలోని వెంగళాపురం గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించడం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పశు గణాభివృద్ధి ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ మురళి కృష్ణ హాజరయ్యారు. వారి సంస్థ ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్త ంగా ప్రతి మండలంలో ఉచితంగా గర్భకోశ వ్యాధులు నివారణకు పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. లింగ నిర్ధారిత వీర్యాన్ని వాడటం వలన 90 శాతం ఆడ దూడలు పుడతాయని ఒక ఇంజక్షన్ 150 రూపాయలు, పశుపోశకులు ఉపయోగించు కోవాలని తెలియజేశారు. అనంతరం వి.వి పాలెం సహాయ సంచాలకులు డాక్టర్ ఇ.చెన్నకేశవులు మాట్లాడుతూ పశువులలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు గురించి వివరించారు.మండల పశు వైద్యులు డాక్టర్ సుబ్రమణ్యం, పోకూరు పశు వైద్యులు డాక్టర్ సుధాకర్ పశువులను పరీక్షించి ఖనిజ లవణాల మిశ్రమము, లివర్ టానిక్ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంగళా పురం పాడి రైతులు, సన్న జీవాల రైతులు, రైతు సేవా కేంద్రం పశు సంవర్ధక శాఖ సహాయకులు వినోద్ కుమార్, కిరణ్, రమేష్, చౌడయ్య, పాండు రంగారావు, తరుణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.


దాణా పంపిణీ చేస్తున్న అధికారులు

సిసి రోడ్డు నిర్మాణాలలో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండలంలో ఇప్పటివరకు నిర్మించిన, నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాల్సిందే అని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉన్నం మాలకొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చుండి, అయ్యవా రిపల్లె, రోళ్లపాడు, కొండస ముద్రం, శాఖవరం గ్రామాలలో ఇటీవల నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ నాణ్యతలను పరిశీలించారు. కొండస ముద్రంలో సచివాలయం ఎదురుగా ఇటీవల 20 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో 86 మీటర్ల పొడవులో నిర్మించిన సిసి రోడ్డు నాణ్యత నమూనాలను పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు సేకరించారు. ఈ సందర్భంగా డీఈ మాలకొండయ్య మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ నాణ్యతలో సేకరించిన నమూనాలను తనిఖీ చేసి నివేదిక వచ్చిన ఐదు రోజులలో నాణ్యతలో తేడాలుంటే రికవరీ కి ఆదేశిస్తా మన్నారు. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయిలోనే నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కందుకూరు క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎఇ ఆర్ వి.వేణుగోపాల్, ఏఈ ఎస్ శ్రీనివాసులు, కాంట్రాక్టర్ ఘట్టమనేని సుబ్బారావు, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.



20 వీల్ చైర్స్ వితరణ

ప్రజాశక్తి-నెల్లూరు: రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు 23వ డివిజన్ టిడిపి నాయకులు పాముూరు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వారి తండ్రి పాముూరు రమణారెడ్డి జ్ఞాపకార్థం పేషెంట్లకు ఎంతగానో ఉపయో గపడే 10 వీల్ చైర్ లను జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశా లకు వితరణ చేయడం అభినందనీ యమని టిడిపి నాయకులు కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన సర్వజన వైద్యశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ వీల్ చైర్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ , రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎప్పుడూ చెప్పే విధంగా, హంగు ఆర్భాటాలకు దూరంగా, ప్రజాసేవలో ఉండాలని పిలుపు నిచ్చారన్నారు. ఆ పిలుపు మేరకు 23వ డివిజన్ టిడిపి నాయకులు పాముూరు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వీల్ చైర్ లను ప్రభుత్వ వైద్యశాలకు అందజేయడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో జిజిహెచ్ అభివ ద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, మెంబర్లు మొగరాల సురేష్, బ్రహ్మారెడ్డి, దారామల్లి, కార్పొరేటర్లు దుద్దుగుంట (ఒరిస్సా) శ్రీనివాసులు రెడ్డి, మూలే విజయ్ భాస్కర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, 23వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు మేకల మధు, టిడిపి నాయకులు పుల్లారెడ్డి, నన్నం శ్రీనివాసులు, మల్లికార్జున్ రెడ్డి , చల్లా సుబ్బన్న, అబ్బు వెంకటరమణ, దిలీప్ రెడ్డి, చిన్న మల్లికార్జున పాల్గొన్నారు.


వీల్ చైర్స్ అందజేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుడ్లూరు: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న పొలం ఆన్‌లైన్ సమస్యలు, ఇతర ప్రజా సమస్యలు పారదర్శకంగా పరిష్కారం చేయాలని టిడిపి ప్రధాన కార్యదర్శి చుండూరు ప్రసాద్ తెలిపారు. నూతనంగాఎంపికైన చుండూరు ప్రసాద్ తహశీల్దార్ బాలకిషోర్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ బాలకిషోర్‌కు శాలువా కప్పి అభినందించారు. టిడిపి మండల అధ్యక్షులు కాపులూరు వెంకటేశ్వర్లు, విఆర్ఒ చలమారెడ్డి పాల్గొన్నారు.



దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-సైదాపురం
మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శశి ఇంద్రాణి, ఆధ్వర్యంలో గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నామని ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆమె వెంట సర్పంచ్ వెందోటి శారద, ఉపసర్పంచ్ బొలిగర్ల శివకుమార్ యాదవ్‌లు ఉన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

పల్స్‌పోలియో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు
కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పల్స్ పోలియో పోస్టర్ ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఐదు సంవత్సరముల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని, సమీపంలోని పోలియో కేంద్రాలకు పిల్లలను తీసుకువెళ్లాలని సూచించారు. కందుకూరు నియోజకవర్గాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ పి.రమేష్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు పి బ్యూలా గ్రేస్, పి స్టెల్లా కారుణ్య, పీహెచ్ఎన్, ఐ.పద్మావతి పాల్గొన్నారు.

పథకం మార్పు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-ఎద్దుకేషన్
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మార్పు నిర్ణయం, కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. స్థానిక సంతపేటలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకం మార్పు నిర్ణయం, కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఆ పథకం మార్పుతో ఉపాధి కూలీలకు అన్యాయం జరుగుతుందని, అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్.షాన్వాజ్, పి.లీలా మోహన్, గుది విజయ్ కుమార్, తల్లు శీనయ్య, బాబు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు.: ఎపిఎస్ ఆర్‌టిసి ఏలూరు డిపోకు చెందిన పెట్రోల్ బంకులో చోటు చేసుకున్న అవినీతి అక్రమ వ్యవహారంపై జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని, ఈ వ్యవహారంలో ఎటువంటి సబంధం లేని ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెషన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కృష్ణారావులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌టిసి ఏలూరు డిపోలో చోటు కేసుకున్న అక్రమ సస్పెషన్లను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారులకు సమస్య తీవ్రతను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన నాటి నుంచి అవినీతి అక్రమాలను అరికట్టే ందుకు విజయవాడ జోన్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పడు పర్యవేక్షణ చేయాల్సి ఉందన్నారు. వాటిని విస్మరించిన అధి కారులు భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు బహిర్గతం అయ్యేసరికి సంబంధం లేని అధికారులపై చర్యలు తీసుకోవడం, అక్రమంగా సస్పెండ్ చేయడం దారుణ మన్నారు. ఇంతటి అవినీతి చోటు చేసుకుంటే ఇప్పటి వరకు పోలీసు కేసు నమోదు కాకపో వడం దారుణమన్నారు. ఎటువంటి విచారణ చేపట్టకుండా, విధులకు ఎటువంటి సబంధం లేని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్యని సస్పెండ్ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి ఈ అవినీతి అక్రమ వ్యవహారంపై విచారణ చేపట్టి అసలైన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డ బ్ల్యూఎఫ్ నాయకులు ఎం.నాగేంద్ర, రాష్ట్ర కార్య దర్శులు టి.దశరథ, సిహెచ్ రాజేశ్వరి,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె షబ్బీర్, డి.రమణయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్‌నాయకులు

స్వచ్ఛందంగా సంపూర్ణ బంద్

ప్రజాశక్తి-సైదాపురం
మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం నిర్వహించిన సైదాపురం మండల బంద్ స్వచ్ఛందంగా సంపూర్ణంగా జరిగింది. సైదాపురం మండలాన్ని నెల్లూరు జిల్లాలో కొనసాగించాలంటూ 4రోజులుగా నిరసన కార్యక్రమాలు చెపడుతున్న మండల ప్రజలు శుక్రవారం స్వచ్ఛందంగా బంద్ నిర్వ హించారు. ఈ బంద్ మండల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు.మండల కేంద్రం లోని అన్ని దుకాణాలు విద్యాసంస్థలు కూరగాయల అంగళ్ళు, పండ్ల దుకాణాలు పూర్తిగా మూతపడ్డాయి. వాహనాల రాకపోకలు కొద్దిసేపు పూర్తిస్థా యిలో స్తంభించాయి. మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల తాగునీటి సాగు నీటి సమస్యలు తీవ్రమవుతాయని, రవాణా సౌకర్యాల పరంగా కూడా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవా ల్సి వస్తుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై కూర్చుని ధర్నా నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి సేవ్ సైదాపురం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పూలే టీచర్ ఫెడరేషన్ నాయకులు రత్నం, ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు పి.సోమయ్య, ఆర్ వి. రమణయ్య, నాయకులు రఘురామ్,చిట్టి బాబు, పరంధామయ్య, రవి, వెంకటేశ్వర వర్మ, ఎస్ డి షరీఫ్ బాబు, చిరంజీవి,చంగల్ రావు, అనిల్ పాల్గొన్నారు.


నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు
29 డివిజన వి ఎం ఆర్ నగర్ 3వ వీధిలో ఈ నెల 21వ తేదీన డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్‌కె రోషన్ ఉత్తరక్రియలను పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ రూరల్ కమిటీ పిలుపు నిచ్చింది. శుక్రవారం ఈ రక్తదాన శిభిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిస్తూ రక్తదాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి గోను చైతన్య మాట్లాడుతూ 29 డివిజన వి ఎం ఆర్ నగర్ 3 వీధి ప్రాంతంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి డి రాజా, బి వెంకటేశ్వర్లు, డి సుబ్రహ్మణ్యం, టీ పెంచలయ్య, డి వంశి, పి వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి



ప్రజాశక్తి-ఉదయగిరి : విశాఖలో జరిగే అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజ్జంపల్లి గ్రామంలో దుకాణ యజమానులను కలిసి కరపత్రాలను అందజేస్తూ ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్టణం నగరంలో ఐదు రోజులపాటు జరగనున్నాయని ఈ మహాసభలు రాష్ట్రంలో మొదటిగా జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభను ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కోడే రమణయ్య, ఖాజావలి నాయబ్ రసూల్ చిన్న ఫరీద్ జిలాని భాషా పాల్గొన్నారు.

ఉద్యోగులకు అభినందన సత్కారాలు



ప్రజాశక్తి - కావలి : రాయల్ ఛారిటబుల్ ట్రస్ట్ 4వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులలో 11మంది ఉత్తమంగా ప్రజలకు సేవలందిస్తున్న వారిని గుర్తించి ఘనంగా సత్కరించారు. పట్టణంలోని పెన్షనర్స్ బిల్డింగ్‌లో ట్రస్ట్ కన్వీనర్, బి.సి. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బండికోటి చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సమాజంలో అను నిత్యం ప్రజాసేవలో తమ జీవితమును గడుపుతూ ఎటువంటి గుర్తింపుకు నోచుకోని కార్మిక కర్షక శ్రమజీవులైన ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌ను ఘనంగా సన్మానం చేసి, వారి సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలిశెట్టి శ్రీనివాసులు, లైఫ్ కేర్ హాస్పిటల్ డాక్టర్ సిహెచ్ ప్రసాద్‌రావు, ఆనంద్ హాస్పిటల్స్ డాక్టర్ ఆనంద్ కుమార్, ఎస్ఎండి డెంటల్ వైద్యులు ఎస్‌కె ఫయాజ్ శ్రీ మేథా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పి.జానకిరామ్, జె.వి.వి. అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, మాధవ ఐ హాస్పిటల్స్ ఆర్ మాధవ, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్ భాషాలు వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బాధ్యులు పాశం శ్రీనివాసులు మాట్లాడుతూ తమ ట్రస్ట్‌కి సహకరించిన దాతలందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు పొన్నగంటి మాధవరావు, ఎందేటి వేణుగోపాల్, ఎర్రబోలు ప్రభాకర్, జి.వేణుగోపాల్, నాగిశెట్టి శ్రీనివాసరావు, ఉప్పాల అశోక్ కుమార్, పురిని యానాదయ్య, పర్వత రెడ్డి వెంకట సుధాకర్ రావు, ఆంజనేయులు, పాశం రమేష్ తదితరులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు జిల్లా స్థాయిలో శనివారం పల్లిపాడు డైట్ కళాశాలలో సైన్స్‌ఫెయిర్‌కు సెలెక్ట్ అయినట్లు కె.ప్రిన్సిపాల్ శ్రీదీప్ తెలియజేశారు. ఆదేవిధంగా హెల్త్ అండ్ హైజిన్ అనే విభాగంలో సీజనల్ డిసీజెస్ అనే అంశాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి, మండల స్థాయిలో మొదటిగా నిలిచిన విద్యార్థులకు శ్రీగంధం వెంకటరామయ్య బహుమతులను అందజేశారు. పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో మెరుగైన సౌకర్యాల కోసం చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. బోగోలు ఎండిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎండిఒ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సాదు ప్రసాద్, నూనె వెంకయ్య, బాబుసుగుణమ్మ ఇంకా అనేకంది పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-కోవూరు : పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమని ఈ దశలో ప్రణాళికబద్ధంగా తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా దృష్టి సారిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ హరిత అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్ర వారం వంద రోజుల ప్రణాళికలో భాగంగా 170మంది విద్యార్థులకు బలవర్ధమైన అల్పాహారం ఆమె సొంత నిధులతో అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడాకారుడు జమాల్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - కావలి : సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు వన్‌టౌన్ ఎస్ఐ జమాల్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం జె.బి.డి.ఆర్. క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులు కేక్ కట్‌చేసి, జన్మదిన వేడుకలు నిర్వహించారు. జె.బి.విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జెబి పిడి ప్రసాద్ రెడ్డి, పీజీ కాలేజ్ మణికంఠ, విట్స్ పిడి కాలేజ్ పిడి అభ్రాజ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మెనూను తప్పక అమలు చేయాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూనుతప్పక అమలు చేయాలని కోవూరు తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రణాళికబద్ధంగా అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు.

అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కావలి : కావలిలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాలలో శుక్రవారం డాక్టర్ ఎం.సుశీల పిఎం ఉష కార్యాచరణ సమన్వయకర్త ఆధ్వర్యంలో ఆరోగ్య నిర్వహణ, స్థిరమైన రొయ్యల ఆక్వాకల్చర్ 2025పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు, అధ్యక్షత వహించగా నెల్లూరు వియసియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశిష్ట వక్తలుగా మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రాజారామిరెడ్డి, మాంగ్లయథాన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.ఎస్. సాంబశివరావు విచ్చేయగా, అంతర్జాతీయ వక్తలుగా స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ న్యూయార్క్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పెంట్యాల, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ జార్జియా యు.ఎస్.ఎ. నుండి ప్రొఫెసర్ స్వామి ముతింటి విచ్చేశారు.

డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని ఎఎస్‌పేట పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఎఎస్‌పేట ప్రముఖ యాత్ర స్థలం కావడంతో దర్గా వద్ద ఎటువంటి సమస్యలు ఎత్తకుండా సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో సంగం సిఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఐ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళికి సైన్స్ ఉపయోగకరం

ప్రజాశక్తి-కోవూరు : సైన్స్ మానవాళికి ఎంతో ఉపయోగకరమని ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి సైన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సైన్స్ సెంటర్ క్యురేటర్ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. కోవూరులోని పీఆర్ఎన్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం కలామ్ సైన్స్ అన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా సైన్స్ సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'పై అవగాహన



ప్రజాశక్తి-కావలి : కావలి పాతూరు, 4వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో " సేఫ్ టచ్- అన్ సేఫ్ టచ్ " (గుడ్ టచ్- బ్యాడ్ టచ్), ' డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ' అనే అంశాలపై డాక్టర్ బెజవాడ రవికుమార్ (గౌరవాధ్యక్షులు జెవివి) మాట్లాడారు. కోశాధికారి టి.సుబ్బరామశర్మ అధ్యక్షతన జరిగిన అవగాహనా సదస్సులో కావలి ఎంఇఒ బండి గోవిందయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుజాత, జెవివి జిల్లా కార్యదర్శి పి.జానకిరామ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, కార్యవర్గ సభ్యులు శివయ్య, ఉపాధ్యక్షులు కందికట్టు నారాయణ, ఈసీ సభ్యులు, ఎం.వి.ఎన్. ప్రసాదరావు, జమీర్ భాషా, మస్తాన్ వలీ, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ డీజిల్, పెట్రోల్ కలకలం

ప్రజాశక్తి-అల్లూరు : అల్లూరు మండల కేంద్రంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్నారని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ ఇంధనం కారణంగా అనేక ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాణిజ్య వాహనాలు ఇంజన్ సమస్యలకు గురై, స్టార్ట్ కాకపోవడంతో నేరుగా గ్యారేజీలకు చేరుతున్నాయని బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాహన యజమానులకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. ఒక ట్రాక్టర్ యజమాని వివరాల ప్రకారం, మూడు ట్రాక్టర్లకు సుమారు రూ.22వేలు విలువైన డీజిల్ కొట్టగా, అవి కొద్ది సమయంలోనే ఆగిపోయాయని తెలిపారు. కారణం ఏమిటని పరిశీలించగా డీజిల్‌లో నీరు చేరడంతోనే ట్రాక్టర్లు నిలిచిపోయాయని గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయమై పెట్రోల్ బంక్ యజమానులను నిలదీయగా, తమ కుటుంబం తప్ప మరెవరికీ విషయం చెప్పవద్దని, నష్ట పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఆరోపించారు. వాహనాలను రిపేర్ చేయించుకుని వాటికి సంబంధించిన బిల్లులు సమర్పిస్తే నష్టపరిహారం ఇస్తామని చెప్పడంతో, బాధితులు ట్రాక్టర్లు సహా ఇతర వాహనాలు మరమ్మతు చేయించుకుని బిల్లులను పెట్రోల్ బంక్ నిర్వాహకులకు అందజేశారని తెలిపారు. రెండు రోజుల్లో డబ్బు ఇస్తామని చెప్పినప్పటికీ, తర్వాత ఫోన్ చేయగా "నువ్వు ఎవరికైనా చెప్పుకో, డబ్బు ఇవ్వను" అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల 'ఉపాధి' రద్దు దారుణం

పలుచోట్ల సిపిఎం నాయకుల నిరసనలు



కావలిలో..

ప్రజాశక్తి-కావలి : కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సవరణ చేస్తూ పార్లమెంట్ లో తీర్మానించడాన్ని వ్యతిరేకిస్తూ, శుక్రవారం కావలిలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిపిఎం నాయకులు నిరసన చేపట్టారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బి కృష్ణయ్య, వై కృష్ణమోహన్, జి.మధుసూదన్ రావు, మేడ వెంకటేశ్వర్లుతో పాటు సిఐటియు నాయకులు ప్రజాసంఘాల నాయకులు పి.తిరుపాలు, ఎం.రమణయ్య, పి.మధుతో పాటు సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



టిపిగూడూరులో..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఉపాధి హామీ పథకాన్ని గాంధీజీ పేరుపై కొనసాగించాల్సిందేనని సిపిఎం డిమాండ్ చేసింది. శుక్రవారం నరుకూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఈపూర్ లక్ష్మయ్య, మండల కమిటీ సభ్య లు బండి శౌరి, మారుబోయిన రాజా, మహిళా సంఘం కార్యదర్శి కందిపాటి రమణమ్మ మాట్లాడారు.



బుచ్చిలో..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : గ్రామీణ పేదల కోసం గతంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గం అని సిపిఎం నాయకులు ఖండించారు. ఉపాధి పథకం పేరు మార్చిడి ఉత్తర్వుల పత్రాలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి విస్తా మునిస్వామి, జిల్లా నాయకులు గరికిపాటి సురేష్, పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, ఆవాజ్ నాయకులు షేక్ మునీర్ అహ్మద్, షేక్ జానీ భాషా, సిపిఎం నాయకులు షేక్ ఖాదర్ బాషా. కందికట్టు వెంకటరమణయ్య, బిల్లా రఘురామయ్య యువజన సంఘం నాయకులు కొమ్మి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరు : వామపక్షాలు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి నిరుపేద వర్గాలుగా వారికి నిరంతరం ఉపయోగపడే ఉపాధి హామీ పథకం అమల్లోకి తీసుకుని వచ్చి సాధించుకున్న చట్టానికి మోడీ తూట్లు పొడిచి పథకానికి పెట్టిన మహాత్మా గాంధీ పేరుని తొలగించడంపై సిపిఎం ఆధ్వర్యంలో గుడ్లూరులో గాంధీ బొమ్మ విగ్రహం దగ్గర నిరసన ప్రదర్శన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గుడ్లూరు సిపిఎం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో జి. వెంకటేశ్వర్లు, తోటి రైతు సంఘం నాయకులు దామకృష్ణయ్య, సిపిఎం కార్యదర్శి కొట్టే వెంకయ్య, ఎం. సుభాన్, ఎస్ కే ఖాదర్‌బాషా, డి బాలకోటయ్య, రాపూరు మాల్యాద్రి, మాల కొండయ్య పాల్గొన్నారు.



గుడ్లూరులో..



కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు : ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా వామపక్షాలు, కార్మిక, వ్యవసాయ, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కోవూరు గాంధీ బొమ్మ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదల జీవనాధారమని, అలాంటి పథకాన్ని బలహీన పరిచే సవరణలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహన్‌రావు, నాయకులు జి.శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై పోలీసుల జులుం అన్యాయం



ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నెల్లూరు పట్టణంలో తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చూపించాలని ఆందోళనకు దిగిన కార్మికులపై పోలీసు జులుం ప్రదర్శించడం అత్యంత దారుణమని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, మహేష్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిగిన పోలీసు లాఠీఛార్జ్‌కి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురవయ్య, రూబిన్, కిరణ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : 45 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టేందుకు వెళుతున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీలు ఝళిపించారు. ఈ చర్యను కావలి మహిళా సామాజిక కార్యకర్త చాకలకొండ శారద ప్రకటనలో ఖండించారు. ఈ ఆమె సందర్భంగా మాట్లాడుతూ మహిళని కూడా చూడకుండా తోసేసి, తోపులాటలో కిందపడిపోయిన కొందరు గాయపడగా, కొందరు లాఠీఛార్జ్ వల్ల గాయపడ్డారన్నారు. మహిళా కార్మికులపై గాయపడేలా లాఠీఛార్జ్ జరపడం అత్యంత హేయమన్నారు.



కావలిలో..

ప్రజాశక్తి-కావలి : నెల్లూరులో మున్సిపల్ కార్మికులు తమ న్యాయమై నసమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులపై పోలీసులు లాఠీఛార్జి జరిపి కార్మికులకు భయాందోళనకు గురిచేసి, అక్రమంగా అరెస్టులను ఖండిస్తూ శుక్రవారం కావలిలో 4వ నెంబర్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, సిఐటియు నాయకులు బి.కృష్ణయ్య, యూనియన్ నాయకులు జె.బాబు, వై.క్రాంతి కుమార్, ఒంగోలు రమేష్, తురక సీనయ్య, ఎస్.కె.షాన్‌వాజ్, మహిళా నాయకులు పి చిన్నమ్మ, తిరుపతమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

సోలార్ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ప్రజాశక్తి-మర్రిపాడు : ఆత్మ సౌజన్యంతో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం కెవికెలో శుక్రవారం సోలార్ డ్రైయింగ్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన విభాగానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సుజాత పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయంలో సోలార్ డ్రైయర్ల వినియోగం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఎండబెట్టడంలో సోలార్ డ్రైయర్లు ఎలా ఉపయోగపడతాయో వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ శారద, ఆత్మ డి.ఎ.ఒ. మురళి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.లలిత శివజ్యోతి, ఎన్.నవీన్, ఎ.ప్రసూన, మండలాల రైతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని విలువైన సమాచారం పొందారు.

కో-ఆపరేటివ్ బ్యాంక్ స్వర్ణోత్సవాలు



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : రైతుల ఆర్థిక బలానికి బలమైన పునాది వేసిన ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలు రైతుల ఐక్యతను చాటేలా ఘనంగా నిర్వహించనున్నట్లు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గండవరపు అమర్నాథ్ రెడ్డి తెలిపారు. 1956లో రైతుల అవసరాలే లక్ష్యంగా ప్రారంభమైన ఈ సహకార సంస్థ 1975 డిసెంబర్ 20న అధికారికంగా నమోదై అప్పటి నుంచి రైతులకు రుణాలు, ఆర్థిక సహాయం, సహకార సేవలు అందిస్తూ అర్ధ శతాబ్ద కాలంగా విశ్వసనీయ సేవలు కొనసాగిస్తోందని అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా సహకార వ్యవస్థను బలపరచడమే లక్ష్యంగా ఈ బ్యాంక్ పనిచేస్తోందని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. సంక్షోభ కాలాల్లో కూడా రైతులను ఆదుకునే విధంగా సొసైటీ సేవలు కొనసాగాయన్నారు. డిసెంబర్ 20, 2025 శనివారం ఉదయం 4 గంటలకు ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ ఆవరణలో "50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలు" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కోవూరు నియోజకవర్గ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విజేతలుగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు



బహుమతులతో క్రీడా విజేతలు

ప్రజాశక్తి - ఉదయగిరి : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో 2025 -26 సంవత్సరం మూడు దశలుగా నిర్వహించిన 18 కళాశాలల, అంతర కళాశాల స్థాయి క్రీడలు ఆటలు సాంస్కృతిక సాహిత్య పోటీలలో విజేతలుగా నిలిచిన మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అభినందన సభను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి బోధన బోధనేతర సిబ్బంది, కళాశాల కీర్తి బావుటాను విశ్వవిద్యాలయ స్థాయిలో రెప రెపలాడించారు.

అష్ఫఖుల్లాఖాన్‌కు ఘన నివాళులు



నెల్లూరులో..

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫఖుల్లా ఖాన్ - రాంప్రసాద్ బిస్మిల్‌కు ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఘన నివాళులర్పించారు. శుక్రవారం పండిత రామ్ ప్రసాద్ బిస్మిల్ అష్ఫాఖుల్లా ఖాన్ - పండిట్ రామ్ ప్రసాద్ బిస్మిల్ ల 98 వర్ధంతి సందర్భంగా నగరంలోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ బిస్మిల్- అష్ఫాఖుల్లా ఖాన్ ల చిత్రపటానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం వి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ చాన్ బాషా, షేక్ రియాజ్, షేక్ ఫయాజ్, ఉస్మాన్ రిటైర్డ్ సంఘం నాయకులు పి సుబ్రహ్మణ్యం, మాదాల రవి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : అష్ఫఖుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ మాట్లాడారు.కార్యక్రమంలో నాయకులు అహ్మద్, షానవాజ్, షాజహాన్, లతీఫ్ అహ్మద్, జియా, జిలాని, మున్వర్, షాకీర్ పాల్గొన్నారు.



మర్రిపాడులో..


ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరవీరులు అష్ఫఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్లా వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సయ్యద్ ఖాదర్ మస్తాన్, ప్రధాన కార్యదర్శి కాలేషా మహమ్మద్, సిపిఎం మండల కార్యదర్శి రహంతుల్లా, ఖాజావలీ, అస్గర్‌అలీ, గౌస్ బాషా, సుధాకర్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.



కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఫైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అష్ఫఖుల్లాఖాన్ వర్ధంతి కార్యక్రమం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రహీం శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ ప్రతినిధులు షేక్ దస్తగిరి బాషా, సయ్యద్ నయీమ్‌బాషా, షేక్ నవాజ్ షరీఫ్, షేక్.అబ్దుల్‌నబీ, షేక్.మస్తాన్, షేక్.హాఫీజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరులను స్ఫూర్తిగా తీసుకొని బ్రిటీష్ వారితో పోరాడి అమరులైన వీరులకు మండల ఆవాజ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు గ్రామంలో ఆవాజ్ మండల కమిటీ సభ్యులు బ్రిటీష్ వారు ఉరి తీసిన మహావీరుల వర్ధంతి సందర్భంగా శుక్రవారం వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జానీభాయ్, మండల అధ్యక్షులు షేక్ జక్రియ, కమిటీ సభ్యులు షేక్ మున్నా, షేక్.షాకీర్, బాబు, రఫీలు పాల్గొన్నారు.



బుచ్చిలో..



కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు : భారత స్వాతంత్ర్య సమరయోధులు పండిట్ రాంప్రసాద్ బిస్మిల్, అశ్ఫాకుల్లా ఖాన్‌ల 98వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం కోవూరు మందబేలు సెంటర్‌లోని సీతాపోలయ్య కార్యాలయంలో ఆవాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల కార్యదర్శి ఎస్.కె. చాంద్‌బాషా, అధ్యక్షులు ఎస్.కె.బాబు మేస్త్రీ, గండవరపు బుజ్జయ్య, గోవర్ధన్, గండవరపు శేషయ్య, పెద్దబ్బయ్య, షఫీ, మోహన్, నజీర్ బాయ్, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి : కావలి డైలీ వేజ్ పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి యూనియన్ గౌరవ అధ్యక్షులు మండ్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షులు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి తన్నీరు వెంకటేష్, సిపిఐ కావలి నియోజకవర్గం సహాయ కార్యదర్శి దమ్ము దర్గాబాబు, కార్మికులు వి.శ్రీలక్ష్మి, శ్రీను, పి. వెంకట రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'నలిశెట్టి' కుటుంబానికి బొమ్మిరెడ్డి పరామర్శ



ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో టిడిపి నాయకుడు నలిశెట్టి సీనయ్య (కూరగాయల సీనయ్య) గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన సీనయ్య కుటుంబ సభ్యులను బొమ్మిరెడ్డి తారకనాథ్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆకస్మిక మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సీనయ్య సతీమణి, ముగ్గురు కుమారులు వారి అన్నదమ్ములతో కుటుంబ సభ్యులతో జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో మనోధైర్యాన్ని కోల్పోకుండా ధైర్యంగా ఉండాలని బొమ్మిరెడ్డి తారకనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులకు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కారం



ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి సహకారంతో బోగోలు మండలంలోని విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయని మండల ఉపాధ్యక్షుడు కుంచాల తిరుమలేష్ పేర్కొన్నారు. బోగోలు పంచాయతీ బేతనిపేట గ్రామంలో లో ఓల్టేజ్ సమస్యను ఎలక్ట్రికల్ ఎఇ జడరాయ తెలపడంతో శుక్రవారం నూతన ట్రాన్స్‌ఫారంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోగోలు మండల ఉపాధ్యక్షుడు తిరుమలేష్ మాట్లాడుతూ బేతానిపేట గ్రామంలోని విద్యుత్ సమస్యను ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లడంతో సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్‌ఫారాలను ఏర్పాటు చేశాడని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రతి ఒకటి సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఎఇ జడరాయ మాట్లాడుతూ బోగోలు మండలంలోని పలు విద్యుత్ సమస్యలను ఎంఎల్ఎ సహకారంతో సమస్యలను తీరుస్తున్నామని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో తనిఖీ



ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలను శకునాలపల్లి పాఠశాలను ఎంఇఒ తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ 75 రోజుల ప్రణాళికను పరిశీలిస్తూ అభ్యసన, పఠన సామర్థ్యాలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెమిడీయల్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు తోటి విద్యార్థులతో సమానంగా ఉండే విధంగా చూడాలని తెలియజేశారు. హోలిస్టిక్ కార్డ్స్, అసెస్మెంట్ బుక్‌లెట్స్ ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ హజరత్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.